# బ్రతుకు పాఠం

తులసి బాలకృష్ణ




ఖండి గూటిని పట్టుకుని, ఒక కాలు చిన్న బల్లమీద పెట్టి, రెండోకాలు ఎత్తబోతున్న కిటికీకి - వెనగ్గా తల్లి ఎక్కిళ్ళు వినిపించేసరికి – ఆ పని చెయ్యడం అతనివల్ల కాలేదు. బల్లమీంచి కాలు దించి, ముక్కుమీదుగా కొంచెం మధ్యవేలుతో తోస్తూ అతి నెమ్మదిగ యాంత్రికంగా వెనక్కి తిరిగాడు.

కళ్ల ఎదురుగా ముగ్గిపోయిన తల్లి తండ్రి. గాజుగోళీల్లాంటి ఆ ఎఱ్ఱజీరల కళ్లల్లో ఆర్ద్రత, వాత్సల్యం, బాధ యింకా భాషకందని యెన్నో భావాలు

అనుకుని, వయసు వచ్చినా దరిద్రం వలన పెళ్లికాని అక్కయ్య. ఆమె ప్రక్కగా చెల్లాయి, తమ్ముడు. ఆ ముగ్గురి మొహాల్లోనూ ఒకేరకం దిగులు.

గుండెల్లోంచి దుఃఖం వుబికి, వుబికి వస్తున్నా పెదవులు బిగబట్టి, ధైర్యంగానే వున్నట్లు నటిస్తున్నాడు తండ్రి. కర్రపట్టుకున్న చెయ్యి — ఆయన మనోభావాలకు ప్రతీకగా కర్రతో సహా వణుకుతూండగా రెండోచెయ్యి దానిమీద వేసి, కదలకుండా నొక్కిపట్టాడు ఆయన.

మూతిమీదుగా పైటకొంగు కప్పిపెట్టి, కన్నీళ్లల్లోంచి తననే చూస్తోంది తల్లి.

నెమ్మదిగా ఎడమవైపుకు తల త్రిప్పాడు కిరీటి.

వీధి అశేష జనం అక్కడ నిలబడి వున్నారు.

అందరి మొహాల్లోనూ ఏదో విచారం. అమూల్యమైన వస్తువేదో తమనుంచి దూరమయిపోతోందనే బాధ. ప్రతి పిల్లవాడి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కిరీటిలా పాఠాలు చెప్పే ప్రైవేటుమాస్టరు యింకొకరు లేరు ఆ వూళ్ళో. అతని శిక్షణలో తమ పిల్లలు ఎంతో గొప్పవాళ్లవుతారని ఆశపడుతూ వచ్చారు ఆ జనం. కానీ ఇకనుంచి ఎలాగ ?!

—నెమ్మదిగా తల్లిదండ్రుల దగ్గరగా నడిచాడు కిరీటి. ఇద్దరూ అతన్ని దగ్గరగా తీసుకుని, తల నిమిరారు.

"జాగర్త నాయనా ! ఎప్పుడూ కూడా యీ వూరైనా దాటివెళ్లని వాడివి. అంత మహానగరంలో ఎలా మసలుకుంటావో ..." అంటూ ప్రొద్దున్నించీ చెప్పుకొస్తున్నదాన్నే మళ్ళీ చెప్పబోయిన తల్లిగొంతు జీరవోయి, పూడుకుపోయింది.

"ఉద్యోగం వచ్చి నువ్వు వెళ్తూంటే ఎంత ఆనందంగా వుందో, ఎప్పుడూ నిన్ను విడిచివుండని మేము ఇకనుంచి నీకు దూరంగా వుండాలంటే అంత బాధగానూ వుందిరా నాయనా! జాగర్త-ఆ మహానగరంలో కార్లూ, బస్సులూ చాలా రద్దీగా వుంటుంది. రోడ్డు దాటేటప్పుడు అదీ బహు జాగర్త బాబూ ప్రతి విషయానికీ రాజారావు సలహా తీసుకుంటూండు" అన్నాడు తండ్రి. బహుశా ఈ విషయం ప్రొద్దున్నించీ ఏ వందసార్లో చెప్పివుంటాడాయన.

"వెళ్లగానే వెంటనే ముందు వుత్తరం రాసిపడెయ్యరా తమ్ముడూ," అంది అక్కయ్య నెమ్మదిగా. నోటితో ఏం చెప్పాలో తెలియని తమ్ముడూ, చెల్లాయి తమ మనోభావాల్ని కళ్లభాషలో అతనికి అందించారు.

అన్నిటికి తలవూపి, తల్లిదండ్రులకు మరోమారు పాదాభివందనం చేసి, అప్పచెల్లెళ్లకేసి, తమ్ముడికేసి, ఊరి జనంకేసి

ప్రేమగా చూసి, బరువు హృదయంతో బండియెక్కాడు కిరీటి.

బండి తనని ఊరునుంచి దూరంగా లాక్కుపోతుండగా – అయినవాళ్లు, ఊరివాళ్లు దూరమయిపోతుండగా – అతని కనుకొలకుల్లో నిలచిన నీటిబొట్లు యిక అగలేక కళ్లజోడు క్రిందుగా జరజరా జారి, మండుతూన్న గుండెమీద పడి, మంట కొంత చల్లార్చాయి. అదురుతూన్న క్రింది పెదవిని మునిపంట నొక్కిపట్టి, కళ్ళుమూసుకుని వెనక్కి జార్లపడ్డాడు కిరీటి.

* * *

ఆ ఊరునుంచి బదిలీఅయి వెళ్ళిపోతూ ప్రమీలతండ్రి, "కిరీటికి హైదరాబాదులో వుద్యోగం వేయించగలను" అన్నప్పుడు – ఆనందం వెల్లివెరిసింది కిరీటి యింట్లో. కానీ...కానీ...... ఎప్పుడూ ఆ ఊరే దాటివెళ్లని కిరీటి ఉండడం ఎక్కడ ? అసలు తనలాంటి పల్లెటూరివాడు మనుగడ సాగించడం సాధ్యమా ? ఆ యింట్లో అదీ తర్జన భర్జన జరుగుతోంది.

కిరీటి తల్లిదండ్రులతో చర్చిస్తున్న హైదరాబాదు ఉద్యోగం విషయం ప్రక్కింటివాళ్ల చెవినపడింది. రెండు నిమిషాల్లో ప్రక్కింటావిడ, ఆవిడ తమ్ముడు రాజారావు యీ యింటి గుమ్మం ముందు ప్రత్యక్షమయ్యారు.

రాజారావు హైదరాబాదులోనే ఉద్యోగం చేస్తున్నాడు. కిరీటి తన రూములోనే వుండొచ్చుననీ, అతనికి అన్ని విషయాల్లోనూ తను సాయపడతాననీ, రూము అద్దె, భోజనం మొత్తం అన్నీ కలుపుకుని నూటఏభై రూపాయల్లో సర్దుబాటు అయ్యేలా తను చూస్తాననీ చెప్పాడు రాజారావు. మొదటి నెల ఖర్చు తను సర్దుతాననీ, జీతం తీసుకున్నాక బాకీ తీర్చొచ్చనీ కూడా చెప్పాడు.

"నిజంగా నువ్వు మా పాలిటి దేవుడివి బాబూ. నీ ఋణం ఈ జన్మలో మర్చిపోలేం" అన్నాడు కిరీటి తండ్రి.

"దీంట్లో పెద్ద సహాయం ఏముందండీ ? ఒక మనిషి సాయం ఎప్పుడూ మరోమనిషికి అవసరమే. నేను చేస్తున్న మహోపకారమేమీ లేదు" అన్నాడు రాజారావు సిగ్గుపడుతూ.

పొట్టి జుట్టూ, సోడాబుడ్డి కళ్ళద్దాలూ, చిన్న కళ్లూ, చెవులపోగులూ, లాల్చీ, పైజామా, వెర్రితెలుపు మనిషి –కిరీటిని చూస్తే రాజారావుకి అదోవిధమైన అభిమానం, కొండంత జాలి.

* * *

రైలు హైదరాబాదు చేరిపోయి పెట్టె అంతా ఖాళీఅయిపోతున్నా కిరీటి మాత్రం కదలకుండా అలానే కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుండిపోయాడు. గుండెలకు హత్తుకున్న బట్టల సంచీ నలిగిపోతోంది. చాలా బెదురుగానూ భయంకరమైన బెంగ

గానూ ఉంది. అన్నీ పట్టిలు ఎలు కుక్కుంటూ వస్తున్న రాజారావు కిరీటిని చూస్తూనే ఎగిరి గంతేసి, సాదరంగా పలకరించి, తన రూముకి తీసుకు వెళ్లాడు. దారిపొడవునా కనబడ్డ ముఖ్యమైన ప్రదేశాలన్నీ వివరంగా చెప్పాడు. విశాలమైన రోడ్లు, బస్సుల మీద బస్సులూ భవంతులూ, ...... అన్నీ చూస్తూంటే కిరీటికి ఎంతో ఆశ్చర్యంగానూ, భయంగానూ వుంది

స్నానం, భోజనం అన్నీ కిరీటికి సక్రమంగా జరిగేలా చూసి, విశ్రాంతి తీసుకోమని పక్క పరిచాడు రాజారావు.

ఎంత బడలికగా వున్నా - యింటి నుంచి దూరమైపోయిన బెంగతో నిద్ర పట్టింది కాదు కిరీటికి. కనుకొలకుల్లో మళ్ళీ నీళ్లూరాయి. రాజారావు అతని ప్రక్కనే కూర్చుని, తల నిమురుతూ, ధైర్యం చెప్పాడు. అలవాటుపడితే నగర జీవితం చాలా సరదాగా వుంటుందని, అసలు వదలబుద్దెయ్యదని నచ్చచెప్పాడు.

—మర్నాడు కిరీటిని తీసుకెళ్ళి ఉద్యోగంలో చేర్పించాడు రాజారావు. మళ్ళీ సాయంత్రం ఆఫీసునుంచి యింటికి తనతో కూడా తీసుకొచ్చాడు రానూ పోనూ డబుల్‌డెక్కర్ ఎక్కి, నగరశోభని చూసిన కిరీటి అదోరక మైన ఆనందానికి గురై, క్రమేపీ బాధ, భయం మరిచిపోయి, ఆ రోజు సుఖం గానే నిద్రపోయేడు.

అప్పుడే నిద్రపోయినట్టున్నాడు, రాజారావు కూడా నిద్రలోకి జారిపోయేడు.

* * *

"పరమపూజ్యనీయులు అమ్మా నాన్నలకి,

నమస్సుమాలు.

ప్రతి ఉత్తరంలోనూ నాకు యిక్కడ వచ్చిన లోటేమీ లేదని వ్రాస్తున్నా -నా ఆరోగ్యం విషయంలో అంతగా మీరు ఆదుర్దాపడుతున్నందుకు నేనెంతో బాధ పడుతున్నాను. ఏ విషయంలోనూ నాకు యిక్కడ వచ్చిన లోటేమీ లేదు.

రాజారావు నిజంగా మన పాలిట దేవుడే. అనుక్షణం అతనికి నా యోగ క్షేమాల్ని గురించిన ఆలోచనే. నాభోజనం, నాపడక, నా స్నానం, ఒకటేమిటి అన్నీ చక్కగా జరిగేలా చూసే అతని దగ్గర నిజంగా నాకెంతో సిగ్గుగా వుంటోంది. మర్యాదలు వద్దని ఎంతచెప్పినా ఒప్పు కోడు. మీరు నమ్ముతారో నమ్మరో - నోరు విప్పడం చేతకాని వాణ్ణని మీరు, అందరూ అంటారు కదా - కానీ యిప్పుడు రాజారావు సాంగత్యంతో ధైర్యం వస్తుంది. ఎవరితోనైనా వీలయి నంత ధైర్యంగా మాట్లాడెయ్యగలుగు తున్నాను. అతను తెస్తున్న పుస్తకాల ద్వారా ప్రపంచ జ్ఞానం బాగా కలుగు తోంది.

రేపు జీతం యిస్తారు. గడిచిన నెలకి రాజారావు సర్దిన నూటఏభై అతని

మిగిలినది మీకు పంపిస్తాను. ఈసారి మీకు అతి తక్కువే పంపగలుగుతున్నందుకు విచారిస్తున్నాను. వచ్చే నెలనుంచీ బాకీ వుండదు కాబట్టి ఎక్కువ పంపగలుగుతాను.

భగవంతుడి దయవల్ల మన కోర్కెలన్నీ నెరవేరతాయి. ఈ ఊరొచ్చిన మన కరణంగారి అబ్బాయి నన్ను కలిసాడు, డబ్బు అతన్తో పంపిస్తాను.

అక్కయ్యకు నమస్కారాలు. కిట్టూకి, రాధకీ శుభాశీస్సులు. వాళ్ళిద్దరూ క్రొత్త స్కూలు బ్యాగ్సు కోసం ఎదురు చూస్తుంటారు అనుకుంటూ.

మరోమారు మీ పాదపద్మాలకు నమస్సుమాలు సమర్పించుకుంటూ —

మీ

కిరీటి."

ఉత్తరం పూర్తి చేసి, జీతం రాబోయే 'రేపు' ని తలుచుకుంటూ, ఆనందంతో గబగబా రోడ్డుదాటబోయిన కిరీటి - మీదకు వచ్చిన ఆటోని చూసుకోలేదు. డ్రైవరు నేర్పుగా తప్పించగలిగాడు కానీ అది కిరీటిని రాసుకుని దూసుకుపోయింది. రోడ్డువారగా తూలిపడ్డాడు కిరీటి. దెబ్బలయితే తగల్లేదుగానీ, కళ్ళజోడు ఒకద్దం పూర్తిగా పగిలిపోయింది. కళ్ళనీళ్ళ పర్యంతం అయింది కిరీటికి. ఒక అద్దంలేకపోతే ఒక కన్ను లేనట్లే అతనికి 'రేపు జీతం జాగ్రత్తగా రూముకి చేరుకున్నాడు.

సంగతి తెలుసుకున్న రాజారావు చాలా బాధపడ్డాడు కిరీటి ఎంత వద్దన్నా వినిపించుకోకుండా కళ్ళజోడు పట్టుకెళ్ళి, అద్దం వేయించుకొచ్చాడు రాజారావు.

రాజారావుకితనమీదగల అభిమానానికి తన్మయుడై, గుండెలమీద చెయ్యివేసుకుని హాయిగా నిద్రపోయేడు కిరీటి.

* * *


స్టాంపుమీద సంతకం పెట్టబోతున్న కిరీటికి ఒక్కసారిగా తల్లిదండ్రులూ, ప్రమీల తండ్రి ప్రసాదరావుగారు, రాజారావు స్మృతిపథంలో మెదిలారు. అందరికీ మనసారా వందనాలు అర్పించుకున్నాడు లోలోనే. అతని ఆనందానికి అవధులు లేవు.

మొదటి జీతం. 'తన' సంపాదన. తను కష్టపడి చదువుకున్నదానికీ, కష్టాలుపడి తల్లిదండ్రులు చదివించిన దానికీ ప్రతిఫలం నేటినుండీ అందుతోంది.

ప్రసాదరావుగారి సహృదయపు కానుక.

రాజారావు ఆదరిస్తూ అందిస్తూన్న అమృత హస్తం

డబ్బు అందుకుని, కళ్ళు చెమ్మగిల్లుతూండగా లెక్కపెట్టుకున్నాడు కిరీటి. నా–లు–గు–వం–ద–లు. ఆనందంతో



వుక్కిరిబిక్కిరి అయ్యాడు. మళ్ళీ లెక్కపెట్టుకున్నాడు - నాలుగువందలు మళ్ళీ మళ్ళీ లెక్కపెట్టుకున్నాడు. వందనోటు. రెండు ఏభైరూపాయలనోట్లు, ఇరవై పదిరూపాయలనోట్లు. జీవితంలో మొట్టమొదటిసారిగా వందరూపాయల నోటుని తనచేతుల్తో తాకుతున్నాడు ఒక చీటీ మీద ఆ నోట్ల నంబర్లన్నీ వ్రాసుకున్నాడు. ఆ చీటీ జీవితాంతం దాచుకోవాలనుకున్నాడు. ఆ నెంబర్లు పదిసార్లు చదువుకున్నాడు. ఒక్కసారి సంతృప్తిగా గుండెలనిండా గాలి పీల్చుకుని, డబ్బు ఒక కవర్లో పెట్టి పైజామా జేబులో బాగా లోపలికి అడ్డంగాదోసి, ఆఫీసునుంచి బయట పడ్డాడు.

రోడ్డంతా రోజూకంటే బాగా రద్దీగా కనిపించింది అతని కంటికి. రోడ్డుమీద జనంలో సగంమంది పైగా దొంగ వెధవలుగానూ, డబ్బు కొట్టెయ్యడానికి ఛాన్సు ఎలా దొరుకుతుందా అన్నట్లుగా తనవైపే చూస్తున్నట్లుగానూ అనిపిస్తోంది అతనికి.

'ఈ రోజు బస్సులో వెళ్ళకూడదు. దొంగలుంటారు. కొంచెం కష్టమయినా నడిచేపోవడం మంచిది' అనుకుని, డబ్బుని గుప్పిట్లో బిగపట్టి, జేబులోనే చెయ్యి అలాగే వుంచి, ఎవ్వరూ తనని వెంబడించట్లేదని నిర్ధారణ చేసుకుని, రూముకి బయలుదేరాడు కిరీటి.

ఏదో తెలియని ఆత్మధైర్యం అతన్ని నిటారుగా నిలబెట్టుతోంది. మగతనం తలెత్తి, గుండెబలాన్ని అధికంచేస్తోంది.

కిరీటి రూముకి చేరేసరికి రాజారావు ప్రక్కింటి ఆయనతో అరుగుమీద కూర్చుని, దీక్షగా చదరంగం ఆడుతున్నాడు. ఆ సమయంలో అతన్ని కదపడం ఎందుకని, బట్టలు మార్చుకుని

కిరీటి.

కిరీటి స్నానం ముగించుకుని వచ్చే సరికి -- ఆట అయిపోయినట్లుంది. ప్రక్కింటాయన వెళ్ళిపోయేడు. రాజా రావు చాపమీద కళ్ళుమూసుకుని, వెల్లకిలా పడుకునివున్నాడు.

"ఎవరు గెలిచారు ?" అన్నాడు కిరీటి పలకరింపుగా -- అలమార్లోంచి కళ్ళజోడు తీసి పెట్టుకుంటూ.

"సాధారణంగా గెలుపు నాదే వుంటుంది. నా ఎత్తులకు తిరుగులేదు" అన్నాడు రాజారావు తమాషాగా నవ్వుతూ.

కిరీటి కూడా నవ్వి, పైజామా అందుకున్నాడు - రాజారావు బాకీ తీర్చేద్దామని పైజామా జేబులో చెయ్యి పెడుతూనే గతుక్కుమన్నాడు. గబ గబా జేబంతా వెతికాడు. రెండో జేబు కూడా వెతికాడు గబగబా - తలమీద ఏదో బరువైన సాధనంతో మోదినట్ల య్యింది. లాల్చీ జేబులు కూడా వెతుకు తుండగా రాజారావు అన్నాడు, కళ్ళు తెరవకుండానే -- "ఈ రోజు జీతం యిచ్చారనుకుంటాను" అని.

"ఆఁ అవును -- మీరేమైనా చూశారా ?" అని గబుక్కున అనేసి, నాలిక్కరుచుకున్నాడు. కిరీటి నొచ్చు కుంటూ.

కిరీటి ముఖంలోకి చటుక్కున చూసి, చిరుకోపం చిందులాడింది ఆ గొంతులో.

"క్షమించండి. పొరబాటున అనేశాను. మరేం లేదు. ఈ రోజు జీతం యిచ్చారు. కవరులో పెట్టి, పైజామా జేబులో పెట్టాను. ఆ...అది కనిపించడం లేదు" - ఇంకోసారి అన్ని జేబులు గబగబా వెతుకుతూ, కంగారు పడుతూ, గాభరాగా అన్నాడు కిరీటి. మాట్లాడుతూంటే గొంతు వణుకుతోంది. గుండెల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది.

చాపమీదనుంచి ఒక్క ఉదుటున లేచి, "అలాగా !!! కంగారుపడకుండా నెమ్మదిగా సరిగా చూడండి. ఎక్కడికీ పోదు. ఒకవేళ బస్సులో ఎవరైనా కొట్టేశారేమో ?!......... మీరు ఈ రోజు ఆలస్యంగా వచ్చారు, పైగా ఆనందంగా కనిపిస్తున్నారు. దాన్నిబట్టి జీతం యిచ్చివుంటారని అనుకున్నానన్న మాట" అన్నాడు రాజారావు తను కూడా కిరీటి బట్టలు వెతుకుతూ, సానుభూతిగా.

అప్రయత్నంగా బట్టల్ని వదిలేసి, క్రింద కుప్పలా కూలబడిపోయాడు కిరీటి చెంపలమీదుగా కన్నీరు జారు తోంది. ఆపుకోలేక బావురుమన్నాడు.


"ఛ ఛ ఛ ! ఈ మాత్రానికే ఇంత ఇదైపోతే ఎలా ?! నేనున్నానుగా ! ఈ నెలక్కూడా సర్దేస్తాను -వచ్చే నెల చూసుకుందాం మీరు మరేమీ బాధ



పడకండి. ధైర్యంగా వుండండి" అన్నాడు రాజారావు, కిరీటి ప్రక్కనే కూర్చుని, అతని తలమీద చెయ్యివేసి జుట్టులోకి వ్రేళ్ళుపోనిచ్చి నిమురుతూ.

"...కనీసం వందరూపాయలైనా ఈ నెలకి యింటికి పంపించాలి అనుకున్నాను. ఈ నెలతో మీ బాకీ తీరిపోతే, వచ్చే నెలనుంచి మావాళ్ళకి అవసరమయినంత పంపించవచ్చు నను కున్నాను. కాని...ఇలా...ఎలా..." గొంతు పూడుకుపోయింది.

"మీరేం అధైర్యపడకండి. నాకూ ఈవాళే జీతం యిచ్చారు. మీ యింటికి మీరు పంపిద్దామనుకున్న డబ్బుకూడా




నేను సర్దుతాను. ఏం ? ... ధైర్యంగా ఉండండి మరి...? ఇదుగో వందరూపాయలూ తీసుకోండి. రేపేగా అతను వెళ్లేది" అన్నాడు రాజారావు వంద రూపాయల నోటుని కిరీటి చేతిలో కుక్కుతూ.

మోకాళ్ళ మధ్య మొహం దాచుకుని ఏడుస్తున్నాడు కిరీటి.

"ఇంక ఊరుకోండి మరీ నా దగ్గర డబ్బు తీసుకోవడానికి మీరేం మొహమాట పడక్కరలేదు. అంతగా అయితే మీ దగ్గర వడ్డీకూడా తీసుకుంటా. సరా ?"

—లోపల ఏదో అనుమానం పీకుతూండగా అప్రయత్నంగానే నోటు విప్పి, నెమ్మదిగా నెంబరువైపు దృష్టి సారించాడు కిరీటి.

కళ్ళు మసకలు కమ్మాయి. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. అదే నెంబరు. అవును. ఆ నెంబరూ యింత సేపూ తన నోట్లో నానుతున్నదే. జేబులోంచి చీటీతీసి చూద్దామనుకుని, మళ్ళీ మానుకున్నాడు. కాని నిస్సంశయంగా అదే నెంబరు. అయితే ఈ పని చేసింది...!!!

అతని జీవితంలో ఎన్నడూ అంత ఆశ్చర్యాన్ని ఎరగడు.

తనొక మాయావలయంలో చిక్కుకున్నట్లు, తన చుట్టూ భయంకర విష సర్పాలు తిరుగాడుతున్నట్లు భయం కలిగింది అతనికి.

అప్రయత్నంగానే వందనోటుని రాజారావుకి అందించి, లేచి, గబగబా బట్టలు మార్చుకుని, మిగిలిన ఒక జత,

తువ్వాలు, లుంగీ, దుప్పటీ చేతిసంచిలో కుక్కుకుని, పుస్తకాల కట్ట చేత్తో పట్టుకుని, కన్నీరు ఏకధారగా కారుతూ ఉండగా రాజారావువైపు తిరిగి, చేతులు ఎత్తి నమస్కరించి, "వస్తానండి" అన్నాడు కిరీటి.

"ఎ......యెక్కడికి ?" అన్నాడు రాజారావు అదిరిపడి, తడబడుతూ.

"బ్రతకడానికి – కాదు – బ్రతక నేర్వడానికి" — నొక్కి పలుకుతూ అన్నాడు కిరీటి పైకిచూస్తూ.

"ఉఁ...ఉఁ... నా మాట విని స్థిమిత పడండి... పైగా యిప్పుడెలా వెళ్తారు ?.. చీకటి పడుతోంది" అన్నాడు రాజారావు తలెత్తి. కిరీటి కళ్లలోకి మాత్రం సూటిగా చూడలేకపోతున్నాడు అతను. కళ్ళజోడు వెనకనున్న ఆ అమాయకపు కళ్లల్లోంచి వెలువడుతూన్న ప్రచండ కాంతి తనని భస్మం చేస్తుందని భయం.

"హుఁ ! చీకటి !! ... గుండె ధైర్యం లేనివాడికి వెలుతురు కూడా చీకటేనని, ఆత్మధైర్యంతో నిలబడితే కటికచీకటిలో కూడా కాంతి కిరణం కనిపిస్తు.దనీ తెలుసుకున్నానండీ.మనిషి బ్రతకనేర్వాలి మేస్టారూ ! తన కాళ్ల మీద నిలబడగలగాలి. లేకపోతే యీ ప్రపంచం బ్రతకనివ్వదు. మంచిగా పోయినవాడు మసి అయిపోతాడు. మోసగాళ్ళదే యీ ప్రపంచం. ఎవరి నుంచైనా అవసరంమించి సహాయం పొందడంకంటే మోసపోవడం మరోటి లేదని తెలుసుకున్నాను. మీ సహాయానికి కృతజ్ఞుణ్ణి. 'ఈ నెల డబ్బు పంపలేక పోతున్నా – ఒక మంచి పాఠం నేర్చుకో గలిగినందుకు సంతోషిస్తున్నా'నని మా వాళ్లకు ఓ చీటీ రాసి మా కరణంగారి అబ్బాయి ద్వారా పంపదలచుకున్నాను. సెలవు" అంటూ, కళ్ళజోడు ఒకసారి సరిచేసుకుని, తలపైకెత్తి, రొమ్ము విరుచుకుని, గడపదాటి బయటకు నడిచాడు కిరీటి.

---

చేతికందిన పంట నేలపాలైంది

రైతుగుండెల మంట లార్పివేయండి

— తుఫాను బాధితుల నాదుకోండి

---